క్లుప్తంగా

రెండు మట్టి ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన మట్టి ట్రాక్టర్

రాయవరం: అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు మట్టి ట్రాక్టర్లను తహసీల్దార్ ఆర్వీ కృష్ణారావు బుధవారం సీజ్ చేశారు. మండలంలోని చెల్లూరులో మట్టిని తరలిస్తున్నట్లుగా వచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ క్షేత్ర స్థాయి తనిఖీలు చేపట్టారు. ఆ గ్రామంలోని పడాల శ్రీనివాసరెడ్డి పొలం నుంచి మట్టిని తరలిస్తున్నట్టుగా గుర్తించారు. మట్టిని తీసుకెళ్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, రాయవరం పోలీసులకు అప్పగించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ పంపన రామారావు, వీఆర్వో లోకేష్ తదితరులున్నారు.

ప్రభుత్వ విద్యారంగ పటిష్టతకు కృషి

కపిలేశ్వరపురం: ప్రభుత్వ విద్యారంగ పటిష్టతకు యూటీఎఫ్ విశేషంగా కృషి చేస్తుందని ఆ సంఘం నాయకులు ఇల్లూరి సూరిబాబు, జువ్వల శ్రీనివాస్ తదితరులు అన్నారు. నూతన విద్యా సంవత్సరంలో క్షేత్ర స్థాయిలోని పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం పాఠశాలల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులను అవలంభించగలదని ఆశిస్తున్నామన్నారు.

పీఠంలో నేడు పౌర్ణమి పూజలు



విజయదుర్గ అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో గురువారం పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు పీఠంలో నెలవైన భవానీ అష్టలింగేశ్వరునికి ఏకవార రుద్రాభిషేకం, శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసి దళార్చనలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించనున్నామన్నారు.

వల్లూరులో ముత్యాలమ్మ తీర్థం



విశేష అలంకరణలో ముత్యాలమ్మవారు

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో బుధవారం ముత్యాలమ్మ తీర్థం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆసాదులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు మొక్కులు తీర్చుకున్నారు. సెలవు దినాలు కావడంతో చిన్నారులు తీర్థంలో సందడి చేశారు.

విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో చిత్రాలతో చిన్నారులు

కపిలేశ్వరపురం: వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణలో భాగంగా బుధవారం కపిలేశ్వరపురం గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో చిన్నారులు వివిధ సామాజిక అంశాలపై చిత్రాలు గీశారు. న్యాయ నిర్ణేతల సమక్షంలో విజేతలను వాటిని ఎంపిక చేసి శిబిరం ముగింపు రోజున బహుమతులను ప్రదానం చేయనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

ఘనంగా ఇటికాలమ్మ జాతర

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ అమ్మవారి జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజఘటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మైపాల నాగబాబు, బండారు కొండల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గురువారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థం నిర్వహిస్తారన్నారు.

ఉష్ణోగ్రతతో ఆక్వాకు ఉక్కపోత

- ఎండ తీవ్రతకు చెరువుల్లో వేడెక్కిన నీరు
- తేలుతున్న రొయ్యలు, తక్కువ కౌంట్‌లోనే తప్పని పట్టుబడి



చెరువులో ఆక్సిజన్ తగ్గి పోకుండా తిప్పుతున్న ఏరియేటర్లు



పట్టుబడి పట్టి తూకానికి సిద్ధం చేస్తున్న 100 కౌంట్ రొయ్యలు

కాజులూరు: ప్రచండ భానుడి ఉగ్రరూపంతో రోజురోజుకూ ఎండలు పెరుగుతుండగా భూమిపై ఉండే మానవాళితో పాటు చెరువుల్లో నీరు వేడెక్కి అందులో ఉండే చేపలు, రొయ్యలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో చెరువు నీటిలోని ప్లాంటేషన్ చనిపోయి నీరు పలుచబడి సూర్యరశ్మి నేడుగా అడుగు భాగానికి చేరుతోంది. దీంతో నీటి నాణ్యత సైతం పాడై చెరువుల్లో రొయ్యలు చనిపోతున్నాయి. ఆక్వా సాగులో రొయ్యల బతుకుదలకు, ఎదుగుదలకు నాణ్యమైన నీటి నిర్వహణపైనే ఆధారపడి ఉంటుంది. వేసవి ఎండ తీవ్రతకు నీటి ఉష్ణోగ్రత పెరగడంతో నీటి నాణ్యత ప్రమాణాలపై వ్యత్యాసాలు ఏర్పడి రొయ్యలు చనిపోయేందుకు కారణమౌతుంది. ఈ పరిస్థితుల్లో చిన్న కౌంట్‌లోనే రొయ్యలు పట్టుబడి పట్టవలసి వస్తుండటంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లోనూ, కె.గంగవరం, రామచంద్రపురం మండల గ్రామాల్లో మరో పదివేల ఎకరాల్లోనూ రైతులు రొయ్యల చెరువులను సాగు చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో రొయ్యలు చనిపోతుండటంతో రూ.లక్షల్లో నష్టం వస్తోందని రైతులు వాపోతున్నారు.

రొయ్యల జీవన ప్రక్రియలోనూ ఇబ్బందులు

రొయ్యలు శీతల రక్తపు జీవులు. వీటి శరీరంపై ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రొయ్యలు అవసరమైన ఉష్ణోగ్రత 26 డిగ్రీల నుంచి 28 డిగ్రీల సెంటీగ్రేడ్ అయినప్పటికీ 32 డిగ్రీల ఉష్ణోగ్రత వరకూ వాటి పెరుగుదలపై ఎటువంటి ప్రభావం ఉండదు. ప్రస్తుత పరిస్థితులలో ఉష్ణోగ్రత 32 డిగ్రీల కంటే పెరిగిపోవడంతో రొయ్యల మేత సక్రమంగా తీసుకోకపోవడంతో ఎదుగుదల తగ్గిపోతోంది. దాంతో పాటు వాటిలో వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోయి పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

నీటి నాణ్యతపై ప్రభావం

వేసవిలో ఎండ వేడి కారణంగా ఉష్ణోగ్రతలు పెరగటంతో పాటు ఇతర నీటి నాణ్యత ప్రమాణాలపైనా ప్రభావం చూపుతుంది. వేసవి తీవ్రతకు సాగు చెరువుల్లో నీటి ఆవిరి ప్రక్రియ ఎక్కువగా ఉంటుంది. దీని వలన నీటి నాణ్యత క్షీణించడంతో పాటు, ఉష్ణోగ్రత స్థిరీకరణ ఉండదు. ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులతో నీటి నాణ్యత ప్రమాణాలు నియంత్రించలేనంత హెచ్చుతగ్గులను చూపిస్తాయి. చెరువునీటిలో ఆక్సిజన్ తగ్గి డీవో, పీహెచ్ సాధారణ స్థాయి కంటే తగ్గిపోయే అవకాశాలు ఉండగా సెలినిటి, ఆల్కనిటీ, హార్డ్‌నెస్, అమోనియా, నైట్రేట్ వంటివి సాధారణ స్థాయి కంటే పెరిగిపోయే అవకాశం ఉంది.

నీటి ప్రమాణాల్లో సాధారణ స్థాయి, వేసవిలో వచ్చే మార్పులు ఇలా ..

నీటి ప్రమాణాలు	సాధారణస్థాయి	వేసవిలో మార్పులు
సెలినిటీ	10 నుంచి 25 పీపీటీ	25 పీపీటీ కంటే అధిక సెలినిటీ
డీవో	4 పీపీఎం కంటే ఎక్కువ ఉండాలి	4 పీపీఎంకు తగ్గిపోవడం
ఆల్కనిటీ	120 పీపీఎం	200 పీపీఎం కంటే పెరిగిపోవడం
హార్డ్‌నెస్	1000 పీపీఎం	నీటి ఆవిరి ప్రక్రియ అధికంగా ఉంటుంది
నైట్రేట్	0.01 పీపీఎం	సెలినిటీ హెచ్చుతగ్గులతో అధిక ప్రభావం
పీహెచ్	7.5 నుంచి 8.5	రోజువారీ హెచ్చుతగ్గులు 0.5 కంటే ఎక్కువగా ఉంటుంది

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవిలో రొయ్యలసాగులో రన్నింగ్‌మోటాల్టి ఎక్కువగా ఉంటుంది. ఎండతీవ్రతకు రొయ్యలు వత్తిడికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు నీటి నాణ్యత ప్రమాణాలపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయిస్తూండాలి. ల్యాబ్ నివేదిక ఆదారంగా నీటి నాణ్యత ప్రమాణాలహెచ్చుతగ్గులపై తగు చర్యలు చేపట్టాలి.

– మురళీధర్ పి.ఆండే. సైంటిస్ట్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్, కాకినాడ

రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ

మండపేట: ఈనెల 24 నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మొదలవుతాయని మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. 24 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకూ ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన పరీక్ష కేంద్రాల వివరాలను మీడియాకు వెల్లడించారు. మండపేట మండలం, పట్టణానికి సంబంధించి మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏడిద రోడ్డులోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పోలీస్ స్టేషన్ వీధిలోని పాలడుగు సత్యవతి చంద్రమౌళి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్‌సీఎం చర్చి వీధిలోని సెయింట్ ఆన్స్ ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. ఈ మూడు పరీక్ష కేంద్రాల్లో తెలుగు పరీక్ష 173 మంది, హిందీ 58 మంది, ఇంగ్లిష్ 71, లెక్కలు పరీక్ష 245 మంది విద్యార్థులు రాయనున్నట్టు తెలిపారు. పీఎస్‌కు 387, ఎన్ఎస్ 387 మంది, సోషల్కు128, సంస్కృతం పరీక్షకు 11 మంది విద్యార్థులు హాజరు కానున్నారని రామచంద్రరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: ద్వారపూడి, యానం రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. యానంకు చెందిన కేతు నారాయణమూర్తి తన బైక్‌పై దాక్షరామ వెళుతున్నాడు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడచి వెళ్లుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్‌బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో నారాయణమూర్తి గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాల పాలైన అతడిని యానం ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా సోమేశ్వరస్వామి రథోత్సవం



సోమేశ్వరంలో స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

రాయవరం: హరహర మహాదేవ శంభోశంకర.. నీలగ్రీవ సదాశివ..భావనాతీత భూతేశ..సోమనాథ నమోనమః అంటూ భక్తులు శివ నామస్మరణతో రథాన్ని లాగారు. మండలంలోని సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి వారి రథోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా సాగింది. ఆలయ పురోహితుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో తొలుత ఆలయంలోని స్వామివారికి, అమ్మవారికి పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవానికి ముందుగా స్వామి వారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి పూజలు నిర్వహించారు. పూష్మాండ బలి, హారతులు ఇచ్చిన అనంతరం రథాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. స్వామి వారి రథం లాగడం వలన సకల శుభాలు కలుగుతాయన్న నమ్మకంతో భక్తులు రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. పలువురు భక్తులు వెళుతున్న రథంపైకి కదలీ, బహుబీజ ఫలాలు విసిరి తమ భక్తిని చాటుకున్నారు. రథోత్సవంలో ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, స్థానిక నేతలు గరగ సోమన్న, కోట వెంకట్రావు, గిరజాల వెంకటేశ్వరరావు, ఆలయ ఈవో బాలాజీరామ్‌ప్రసాద్, ఆలయ సిబ్బంది పెన్నాడ వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూలే స్థితిలో బోడిపాలెం వంతెన

- వంతెన మీదుగా వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు
- జిల్లా పర్యాటకుల రాకపోకలు
- నూతన వంతెన నిర్మించాలంటున్న పర్యాటకులు, భక్తులు



శిథిల స్థితిలో ఉన్న బోడిపాలెం వంతెన

కపిలేశ్వరపురం: జిల్లాలోని పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన ధనమ్మ తల్లి ఆలయానికి వెళ్లే బోడిపాలెం వంతెన శిథిల స్థితికి చేరుకుంది. బ్రిటిష్ కాలంలో నిర్మితమైన ఆ వంతెన ఎప్పుడు కూలిపోతుందోనన్న భయాందోళనలో లంక గ్రామల ప్రజలున్నారు. లంక గ్రామాల వ్యవసాయ ఉత్పత్తులను ఈ వంతెన మీదుగానే తరలిస్తుంటారు. జిల్లా పర్యాటక కేంద్రంగా ఉన్న ధనమ్మ మఠ్రికి ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు.

వంతెన పరిస్థితి ఇలా..

కొత్తపేట ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న ఈ వంతెన సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించారు. కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక, వీధివారి లంక, నారాయణలంక గ్రామాలను సమీప కొత్తపేట మండలంలోని కొత్తపేట వాడపాలెంలను ఈ వంతెన అనుసంధానం చేస్తుంది. బ్రిటిష్ కాలం నాటిది కావడంతో వంతెన శిథిల స్థితిలో ఉంది. దీనికి తోడు ప్రస్తుత అవసరాలకు ఏ మాత్రం అనువుగా లేకుండా ఇరుకుగా ఉంది. ఇనుప వంతెన కావడంతో ఇనుము భాగాలు తుప్పుపట్టి ఊడిపడి ఉన్నాయి. రేకులు పైకి లేచి ప్రమాదాలకు సంకేతాలుగా మారాయి. లంక గ్రామాల్లోని వ్యవసాయ ఉత్పత్తులను, ఇసుక, మట్టి, ఇటుకలను ఇతర ప్రాంతాలకు ఈ వంతెన మీదుగానే తరలిస్తుంటారు. కేదారిలంక, నారాయణలంకల్లోని ఇసుక ర్యాంపుల నుంచి వాహనాలు ఈ వంతెన మీదుగా వెళుతున్నాయి. వంతెన రక్షణ గోడలు తరచూ ఊడిపడినపుడల్లా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కార్తిక మాసంలో వందలాది వాహనాలు ఈ వంతెన మీదుగా ధనమ్మ మఠ్రికి చేరుకుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో కొత్త వంతెనను నిర్మించాలని లంక గ్రామల ప్రజలు, భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు.

సంఘటిత కృషితోనే సంఘాల బలోపేతం



శీలలో వెంకన్న కుటుంబానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న కోలసంబర కళాకారుల సంఘం సభ్యులు

కాజులూరు: సంఘటిత కృషితోనే సంఘాలు బలోపేతమవుతాయని వెంకటేశ్వర దుర్గాదేవి కోల సంబర కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈత దుర్గారావు అన్నారు. మండలంలోని శీలకు చెందిన వాసిరెడ్డి వెంకన్న అనారోగ్య కారణంగా కాలును కోల్పోయి గత కొన్ని రోజులుగా ఇంటిలోనే ఉంటున్నారు. దీంతో ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వెంకన్న కుటుంబీకులకు బుధవారం సంఘ సభ్యులు రూ.50 వేలు ఆర్థిక సహకారాన్ని అందజేశారు. సంఘం అధ్యక్షుడు ఈత దుర్గారావు, గౌరవాధ్యక్షుడు కోట శ్రీను తదితరులు మాట్లాడుతూ సభ్యులందరూ ఐక్యతతో సంఘాలను బలోపేతం చేసుకోవటం ద్వారా ఆపదలో ఉన్న సభ్యులకు సంఘాలు చేదోడు వాదోడుగా నిలుస్తాయన్నారు. సమాజంలో ప్రతి వ్యవస్థకు సంఘాలు అవసరమన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వాసంశెట్టి లక్ష్మణరావు, కార్యదర్శి మైగాపుల శ్రీను, సహాయ కార్యదర్శి కానుబోయిన పెద్దిరాజు, కోసాధికారి వనుం కొండ, సంఘ నాయకులు చిక్కాల స్వామికాపు, కూనపురెడ్డి శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధం వెళ్తే చర్యలు తప్పవు



జి.సురేంద్ర

రామచంద్రపురం రూరల్: మండలంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగిందని ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర బుధవారం విలేకరులతో అన్నారు. అదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సోషల్ మీడియా వేదికగా పార్టీలను, వ్యక్తులను ఆధారంగా చేసుకుని రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా అటువంటి వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. అదే విధంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెట్రోలు బంకుల్లో లూజు అమ్మకాలు(వాహనాల్లో కాకుండా టిన్నులు, బాటిల్స్‌లో) నిషేధించడం జరిగిందన్నారు. ఆ నిబంధనను ఎవరైనా అతిక్రమించి లూజు అమ్మకాలు చేస్తే చర్యలుంటాయన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు బాణసంచా విక్రయాలపైనా నియంత్రణ ఉందన్నారు. బాణసంచా అమ్మకందారులు నిబంధనలు పాటించకపోతే వారిపైనా చర్యలుంటాయన్నారు.

దాతల కడుపు చల్లగా..

వేసవిలో దప్పిక తీరుస్తున్న మజ్జిగ చలివేంద్రాలు



కామాక్షీ వడ్రంగి యువజన సంఘం చలివేంద్రంలో మజ్జిగ అందిస్తున్న దాత మధు

మండపేట: చుట్టు పక్కల సుమారు పదిహేను గ్రామాలకు మండపేట ప్రధాన కేంద్రం. ఈ వేసవిలో వివిధ పనుల నిమిత్తం సమీప గ్రామాల నుంచి రోజూ వందలాది మంది పట్టణానికి వస్తున్నారు. వారి దాహార్తిని పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు తీరుస్తున్నాయి. కలువపువ్వు సెంటర్‌లో బస్ దిగగానే ఫ్రెండ్స్ ఎన్ ఫ్రెండ్స్ వారి మజ్జిగ చలివేంద్రం స్వాగతం పలుకుతుంది. టౌన్ హాలు రోడ్డుకు వెళ్లే సరికి శ్రీ కామాక్షీ వడ్రంగి యువజన సంఘం ఆధ్వర్యంలోని మజ్జిగ చలివేంద్రం దప్పిక తీరుస్తుంది. కోటిపల్లి కృష్ణమాచార్యులు, గోడి సుబ్రహ్మణ్యం, రామోజి కృష్ణ, తామరపల్లి సూరిబాబు, చెల్లూరి ప్రకాష్, చెల్లూరి కుమారస్వామి ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే గుమ్మిలేరు రోడ్డు ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న సూర్యా గ్రాండ్స్ వద్ద మరో మజ్జిగ చలివేంద్రం బాటసారుల గొంతు తడుపుతోంది. వైఎస్సార్ సీపీ యువ నేతలు చోడే శ్రీకృష్ణ, సత్యకృష్ణ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం నడుస్తోంది. అలాగే 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజారత్న రోడ్డు వైఎస్సార్ విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఇలా పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాల వద్ద బాటసారులు బారులు తీరి మరీ తమ దాహాన్ని తీర్చుకుని చలువ పందిళ్ల కింద కాసేపు సేద తీరుతున్నారు. కామాక్షీ వడ్రంగి చలివేంద్రంలో మారేడుబాక గ్రామ వాసి స్టార్ హెల్త్ మధు మజ్జిగను పంపిణీ చేసి ప్రజల దాహం తీర్చారు.

వంతెనకు సమీపంలో ఆటో బోల్తా



అప్పనరామునిలంక వైపు వంతెన దిగువన బోల్తా పడిన ఆటో

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య గోదావరి పాయపై కొత్తగా నిర్మించిన వంతెనకు సమీపంలో ప్రయాణీకులతో వెళుతున్న ఆటో ఒకటి బుధవారం బోల్తా పడింది. వంతెనకు అప్పనరామునిలంక వైపు నుంచి టేకిశెట్టిపాలెం ఏటిగట్టుకు వస్తున్న ఈ ఆటో వంతెన అప్రోచ్ రోడ్డు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తూ బోల్తా కొట్టి రోడ్డు చేరి ఉన్న గోదావరి నీళ్లల్లోకి జారుకుంది. అటుగా వెళుతున్న వారు హుటాహుటిన ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు. దీంతో ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అలాగే ఆటోను కూడా రోడ్డుపైకి చేర్చారు. కాగా ఎత్తుగా ఉన్న అప్రోచ్ రోడ్డు ఎక్కే క్రమంలో ఆటోకు చోటు చేసుకున్న ప్రమాదంపై వివరాలు తెలియాల్సి ఉంది.

26న ఏలూరులో పద్య కవుల సమ్మేళనం

సఖినేటిపల్లి: ఈ నెల 26న ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో పద్య కవులకు పట్టాభిషేకం పేరుతో అంతర్జాతీయ శతాధిక పద్య కవుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ బుధవారం తెలిపారు. సఖినేటిపల్లిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, ఈ సమ్మేళనంలో సీస పద్య వైభవం పుస్తకావిష్కరణ చేయనున్నట్టు తెలిపారు. తెలుగు భాషకు పద్యం ప్రాణమని, 175 మంది సీస పద్య కవులతో శ్రీనాథుని సీస పద్య వైభవం పేరిట పై సంకలనం పుస్తకాన్ని ఇప్పటికే రూపొందించామన్నారు. వేర్వేరు ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయిలో ఉన్న తెలుగు పద్య కవులందరినీ ఒక చోటకు చేర్చడమే ఈ వేదిక లక్ష్యమని, దీని ద్వారా వారందరినీ ఘనంగా సత్కరించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. కాగా ఇంత వరకూ శతాధిక పద్య కవులతో ఎక్కడా కూడా సమ్మేళనం జరగలేదని, ఇదో ప్రపంచ రికార్డు కాబోతోందన్నారు. ఇందుకు గాను కవుల నమోదు ప్రక్రియ, సమ్మేళనం నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన వెల్లడించారు.

కోనసీమకు రోడ్, బ్రిడ్జిల కనెక్టివిటీ పెంచాలి



ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి వారణాశి రామ్‌మాధవ్‌కు వినతిపత్రం ఇస్తున్న సామాజికవేత్త బోనం రాజు

మలికిపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రోడ్, బ్రిడ్జిల కనెక్టివిటీ పెంచాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌కు కోనసీమ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి చేసింది. కోనసీమ తీర ప్రాంతం సునామీ, తుపాను ప్రమాదాలతోనూ, గోదావరి వరదల ఉత్పాతంతోనూ, ఓఎన్జీసీ కార్యకలాపాల నిర్వహణా ప్రమాదాల వలన నిత్యం బతుకు భయంతో జీవిస్తున్న కోనసీమ ప్రజలను ఆదుకునేందుకు రోడ్ కనెక్టివిటీ, బ్రిడ్జ్ కనెక్టివిటీస్ పెంచి కోనసీమ ప్రజలను ఆదుకోవాలని వారణాసి రామ్ మాధవ్‌కు సామాజిక కార్యకర్త బోనం రాజు విజ్ఞప్తి చేశారు..మంగళవారం కాకినాడలో ప్రముఖ సంగీత వాగ్గేయకారుడు కొచ్చర్లకోట రామరాజు కీర్తనలను బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించిన కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌మాధవ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించినట్లు బోనం రాజు బుధవారం మలికిపురంలో విలేకరులకు తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కోనసీమ రైలు మార్గం కోసం నిధులు విడుదల చేయించిన సంగతిని గుర్తు చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మంత్రి పినిపే విశ్వరూప్ సహకారంతో ఉభయగోదావరి జిల్లాల ఎంపీలు చింతా అనూరాధ, వంగా గీత, మార్గాని భరత్, పిల్లి సుభాష్ చంద్రబోస్, కె.రఘురామ కృష్ణంరాజు అభ్యర్థన పత్రాలతో కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి అభ్యర్థన పత్రం పంపినట్లు కూడా ఆయన వివరించారు.

అగ్నిప్రమాద బాధితునికి రెడ్ క్రాస్ సాయం



బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న జంపన బుజ్జిరాజు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నేదునూరి పెద్దింట్లు కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో రాజోలు, గన్నవరం నియోజకవర్గాల రెడ్ క్రాస్ కార్యక్రమాల సమన్వయకర్త జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా టార్పాలిన్, వంట సామగ్రి, హైజెనిక్ కిట్స్, బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు అందించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సహాయ కార్యదర్శి బోనం రాజు, తాడి సహదేవ్, నల్లి శివకుమార్, జిల్లా కోఆర్డినేటర్ రత్న ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: మరింత మంది విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు కథలు, పుస్తక సమీక్ష తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు వినే నైపుణ్యాలు (కథలు), పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్, పెయింటింగ్, ఆటలు, ఆధ్యాత్మిక విషయాలు, వివిధ సబ్జెక్ట్స్, నీతి కథలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్లు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.